క్లుప్తంగా

హోంగార్డు కుటుంబానికి ఆర్థిక సహాయం



పటమట(విజయవాడతూర్పు):నగరంలో పనిచేస్తున్న హోంగార్డులలో ఎవరైనా మరణించిన లేక పదవీ విరమణ చేసినా వారు ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా ఉండేందుకు కృషి చేస్తున్నామని పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు అన్నారు. విజయవాడ హోంగార్డు యూనిట్‌లో విధులు నిర్వహిస్తున్న ఎస్. అర్జునరావు ఇటీవల ఆకస్మికంగా గుండెపోటుతో మరణించారు. దీంతో ఆయన కుటుంబాన్ని ఆదుకునేందుకు పోలీసులు హోంగార్డులకు వారి వేతనం నుంచి ఇచ్చిన రూ.5లక్షల ఆర్థిక సహాయాన్ని ఆయన హోంగార్డు అర్జునరావు భార్య ఎస్వీ లక్ష్మీకి అందంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో పనిచేస్తున్న హోంగార్డులు అందరూ స్వచ్ఛందంగా వారికి వచ్చే వేతనం నుంచి చనిపోయిన హోంగార్డు కుటుంబాలకు లేదా పదవీ విరమణ చేసిన హోంగార్డులకు ఆర్థిక ఆసరా కల్పిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో హోంగార్డు ఆర్.ఐ. కె.సుధాకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిపై గాజు సీసాతో దాడి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): తన భార్యతో మాట్లాడుతున్నాడని ఓ వ్యక్తిపై గాజు సీసాతో దాడి చేసిన ఘటన భవానీపురం బ్యాంక్ సెంటర్‌లో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విద్యాధరపురం కామకోటినగర్‌కు చెందిన నాగోజు ఉదయసాయి భవానీ హాస్పిటల్‌లోని మెడికల్ షాపులో పనిచేస్తున్నాడు. శుక్రవారం రాత్రి షాపులో పనులు ముగించుకొని బైక్‌పై ఇంటికి వెళుతున్నాడు. బ్యాంక్ సెంటర్ ఆక్స్‌ఫర్డ్ స్కూల్ సమీపంలోకి వెళ్లే సరికి వెనుక నుంచి రామకృష్ణ అనే వ్యక్తి గాజు సీసాతో ఉదయసాయిపై దాడి చేశాడు. తల, కుడి చేయి, వీపుపై గాజుతో పొడిచాడు. ఆ సమయంలో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. అక్కడికి సమీపంలో ఉన్న రామకృష్ణ సోదరుడు సాయి వచ్చి గొడవ పెద్దది చేశాడు. ఆ సమయంలో గాయపడిన ఉదయసాయిని స్నేహితులు భవానీ ఆసుపత్రికి, అక్కడ నుంచి ఆంధ్ర హాస్పిటల్‌కు తరలించారు. మెరుగైన వైద్యం కోసం న్యూ జీజీహెచ్‌కు తరలించారు. తనపై జరిగిన దాడి ఘటనపై ఉదయసాయి పోలీసులకు స్టేట్‌మెంట్ ఇవ్వగా పోలీసులు కేసు నమోదు చేశారు.

22 నుంచి దసరా ఉత్సవాలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ):భీమనవారిపేటలోని గంగానమ్మ దేవస్థానంలో 22వ తేదీ నుంచి దసరా ఉత్సవాలు నిర్వహిస్తున్నామని శ్రీదుర్గా గాయత్రి అర్చక యాగ్నిక పురోహిత సేవా సంఘ అధ్యక్షుడు విన్నకోట శ్రీనివాసరావు శర్మ తెలిపారు. శ్రీదుర్గా గాయత్రి అర్చక యాగ్నిక పురోహిత సేవా సంఘం ఆధ్వర్యంలో 11 రోజుల పాటు నిర్వహించే ఉత్సవాల్లో ప్రతి రోజూ అమ్మవారికి విశేష అలంకారం, కుంకుమ పూజలు, పుష్పార్చనలు జరుగుతాయన్నారు. 22వ తేదీ శ్రీబాలా త్రిపుర సుందరీదేవి, 23వ తేదీ శ్రీగాయత్రి దేవి, 24వ తేదీ శ్రీఅన్నపూర్ణాదేవి, 25వ తేదీ శ్రీకాత్యాయనిదేవి, 26వ తేదీ శ్రీమహాలక్ష్మీదేవి, 27వ తేదీ శ్రీలలితా త్రిపుర సుందరీదేవి, 28వ తేదీ మహాచండీదేవి, 29వ తేదీ శ్రీ సరస్వతిదేవి, 30వ తేదీ దుర్గాదేవి, 01వ తేదీ మహిషాసురమర్ధిని దేవి, 02వ తేదీ శ్రీరాజరాజేశ్వరిదేవి అలంకారాలు ఉంటాయన్నారు. ఉత్సవాలకు తరలివచ్చే భక్తులకు అవసరమైన అన్ని ఏర్పాట్లను ఆలయ ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ బసవ కాశీ విశ్వనాథ్, గౌరవ అధ్యక్షులు సుంకర వెంకటేశ్వరరావు, సెక్రటరీ విజయ్‌కుమార్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఉత్సవాలలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకోవాలని భక్తులను కోరారు.

పెద్దల అనుభవాలే పిల్లలకు పాఠాలు

భవానీపురం(విజయవాడపశ్చిమ):జీవితంలో ఎన్నో అనుభవాలు గడించిన అమ్మమ్మ, నానమ్మ, తాతయ్యలు చెప్పే మంచి విషయాలే పిల్లలకు పాఠాలని, వారి మార్గదర్శకంలో నడిచిన విద్యార్థులు ఉత్తమ పౌరులుగా ఎదుగుతారని సెయింట్ జాన్స్ పాఠశాల కరస్పాండెంట్ టి.సుమన్ త్యాగరాజ్ అన్నారు. భవానీపురం క్రాంబ్వే రోడ్‌లోని సెయింట్ జాన్స్ పాఠశాలలో శనివారం నిర్వహించిన గ్రాండ్ పేరెంట్స్ డే వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గ్రాండ్ పేరెంట్స్ చెప్పే నీతి కథలు, మహనీయుల విజయ గాథలు, వారి చరిత్రలు విని స్ఫూర్తి పొందాలని సూచించారు. చిన్నారులు విచిత్ర వేషధారణ చూపరులను ఆకట్టుకుంది.

అధికారుల అనాలోచిత చర్యలతో అవస్థలు!

- ముంపు నుంచి తప్పించేందు కంటూ తీసిన కాలువతో ముప్పు
- వర్షం కురిస్తే వెనక్కి తంతున్న కాలువలోని మురుగునీరు
- లేబర్‌కాలనీ ఇళ్లకు తప్పని ముంపు

భవానీపురం(విజయవాడపశ్చిమ):నగర పాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారుల అనాలోచిత చర్యలతో విద్యాధరపురం లేబర్‌కాలనీ ప్రజలు అవస్థలు పడుతున్నారు. వర్షం కురిస్తే జలదిగ్బంధంలో చిక్కుకునే లేబర్‌కాలనీ ప్రజలను ముంపు నుంచి తప్పిస్తామంటూ అధికారులు తీసిన కాలువ కారణంగానే ఇప్పుడు వారికి కొత్త ముప్పు ఏర్పడింది. వర్షం వచ్చినప్పుడు కాలనీలో నిలిచిపోయే నీరు బయటకు వెళ్లిపోయేందుకంటూ కాలనీ నుంచి నిర్మించిన డ్రెయిన్‌కు కలుపుతూ ఆర్టీసీ వర్క్ మేనేజర్ కార్యాలయం రోడ్ మధ్యలో కల్వర్ట్ నిర్మించారు. తద్వారా కాలనీలోని నీరు కల్వర్ట్‌గుండా వర్క్‌షాప్ ప్రహరీకి ఆనుకుని ఉన్న కాలువలోకి వెళ్లి అక్కడ నుంచి ఆర్టీసీ వర్క్‌షాప్ రోడ్‌లోని అవుట్‌ఫాల్ డ్రెయిన్‌లో కలుస్తాయన్నది అధికారుల ఆలోచన. వాస్తవానికి మామూలు రోజుల్లో అయితే కాలనీలోని వాడకం నీరు కల్వర్ట్ ద్వారా వెళ్లిపోతాయి. ఎటొచ్చీ భారీ వర్షాలు కురిసినప్పుడు వర్క్‌షాప్ ముంపునకు గురయినప్పుడే వెనక్కి తన్ని కాలనీ కూడా ముంపునకు గురవుతుంది. అయితే తమ స్థలంలో కల్వర్ట్ నిర్మించవద్దంటూ ఆర్టీసీ అధికారులు అభ్యంతరం తెలిపారు. వర్క్‌షాప్ ప్రహరీకి ఆనుకున్న ఉన్న కచ్చా డ్రెయిన్ స్థానంలో పక్కా డ్రెయిన్ నిర్మిస్తామని వీఎంసీ అధికారులు చెప్పిన మీదట వారు అంగీకరించారు. కాగా ఇటీవల కురిసిన వర్షాలకు కాలనీలోని నీరు కల్వర్ట్ ద్వారా తమ వర్క్‌షాప్ వైపు వచ్చేస్తుందని ఆర్టీసీ అధికారులు కల్వర్ట్‌కు ముందు అడ్డుకట్ట వేయడం గమనార్హం.



ఇటీవల నిర్మించిన కల్వర్ట్‌తో ముంపునకు గురయ్యే ఆర్టీసీ వర్క్ మేనేజర్ కార్యాలయం రోడ్డు

స్థానికులు చెప్పిందే నిజమైంది...

ఆర్టీసీ సంస్థకు చెందిన స్థలంలో కల్వర్ట్ నిర్మించే సమయంలోనే దాని వలన ఉపయోగం ఉండదని స్థానికులు (లేబర్‌కాలనీవాసులు) చెప్పిందే నిజమైంది. ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా ముంపుకు గురైన ఆర్టీసీ జోనల్ వర్క్‌షాప్ ప్రహరీకి ఆనుకుని ఉన్న కాలువ నిండిపోయి వెనక్కి వచ్చిన నీరు కల్వర్ట్ ద్వారా తిరిగి లేబర్‌కాలనీలోకి వచ్చేశాయి. అదికాస్తా జలయమమై కాలనీవాసులు నానా అవస్థలు పడ్డారు. ఈ విషయాన్ని కల్వర్ట్ నిర్మించకు ముందే తాము అనుభవంతో నగరపాలక సంస్థ అధికారులకు చెప్పామని స్థానికులు గుర్తు చేస్తున్నారు. అయితే ఆ సమయంలో అక్కడే ఉన్న పశ్చిమ ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి శ్రీధర్ వారు ఇంజనీరింగ్ చదువుకున్నారు..వారి కంటే మీకు ఎక్కువ తెలుసా అని తమ నోళ్లు మూయించారని కాలనీ పెద్దలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్క్‌షాప్ ప్రహరీ గోడకు ఆనుకుని ఉన్న కాలువ పూర్తిగా పూడికతో నిండిపోతే ఏ నీరయినా ముందుకు ఎలా వెళతాయని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.



జలమయమైన లేబర్‌కాలనీ (ఫైల్)

వీఎంసీ అధికారుల ప్లాన్ మారింది...

తొలుత వర్క్‌షాప్ ప్రహరీకి ఆనుకుని ఉన్న కచ్చా డ్రెయిన్ స్థానంలో పక్కా డ్రెయిన్ కట్టిస్తామని ఆర్టీసీ అధికారులతో ఒప్పందం కుదుర్చుకుని కల్వర్ట్ నిర్మించిన నగరపాలక సంస్థ అధికారులు ఇప్పుడు ప్లాన్ మార్చుకున్నట్లు తెలిసింది. దాని ప్రకారం ముందుగా అనుకున్న చోట కాకుండా దానికి ఎదురుగా ఉన్న ఆర్టీసీ సంస్థకు చెందిన స్క్రాప్, కొత్త బస్సులు పెట్టుకునే స్థలానికి అడ్డుగా ఏర్పాటు చేసుకున్న రేకుల పక్కన కాలువ తీస్తారట. తద్వారా కాలనీలో నుంచి వచ్చే నీటిని కొత్తగా కట్టబోయే కాలువలోకి మళ్లిస్తారట. అక్కడ నుంచి వర్క్‌షాప్ రోడ్‌లోని అవుట్‌ఫాల్ డ్రెయిన్‌లో కలుస్తుందట. అయితే ఇంతకు ముందు నిర్మించిన కల్వర్ట్ వలన ఉపయోగం లేదన్నది స్పష్టం అవుతుంది. కాగా 44వ డివిజన్ శానిటరీ కార్యాలయం పక్క నుంచి మూడు సందుల్లోని సైడు కాలువలను కలుపుతూ కాలువ కట్టి, అక్కడ నుంచి మోడరన్ మ్యాక్స్ టీ స్టాల్‌కు ఆనుకుని కాలువ నిర్మించి అవుట్‌ఫాల్ డ్రెయిన్‌కు అనుసంధానం చేస్తే ముంపు బారి నుంచి బయటపడతామన్నది స్థానికుల వాదనగా ఉంది.

ముసాఫిర్‌ఖానా కమిటీ దేని కోసం?



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):ప్రైవేటీకరణ చేస్తున్న ముసాఫిర్‌ఖానాకు ప్రభుత్వం కొత్తగా నియమించిన కమిటీ దేని కోసమో స్పష్టం చేయాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు షేక్ మస్తాన్, మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి బాజీబాబా డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. ముసాఫిర్‌ఖానా ప్రైవేటీకరణపై తాము నిరసన కార్యక్రమాలనూ చేపట్టిన నేపథ్యంలో ప్రభుత్వం దానికి కమిటీని నియమించిందన్నారు. అయితే దేని కోసం కమిటీని వేశారో అర్థం కావటం లేదన్నారు. అలాగే ప్రైవేటీకరణ వ్యతిరేకిస్తున్న వారిపై అవాకులు పేలుతున్న అధికార పార్టీ నేతలకు ప్రజలు బుద్ధి చెబుతారని తెలిపారు. కూటమి ప్రభుత్వం అన్ని రంగాలను ప్రైవేటీకరించేందుకు అలవాటు పడిందని చెప్పారు. అందులో భాగంగానే వక్ఫ్ ఆస్తులను సైతం ప్రైవేటీకరిస్తుందని పేర్కొన్నారు. ముసాఫిర్‌ఖానా ప్రైవేటీకరణను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు నజీర్, సయ్యద్ అతీక్, మహ్మద్ గౌస్, మొహసిన్ పాషా, షేక్ నజీర్, కరీముల్లా, ఈసుబ్, సల్మా సుల్తానా పాల్గొన్నారు.

వైభవంగా గణేష్ నిమజ్జనాలు



ఊరేగుతున్న వస్త్రలత గణనాథుడు



కొత్తపేట కుమ్మరివీధిలోని స్వామి విగ్రహం



పూలబావి వీధికి చెందిన భారీ గణనాథుడు

- కృష్ణమ్మ ఒడికి చేరుకున్న భారీ గణపతులు
- పాతబస్తీలో భారీ ఊరేగింపులతో ప్రధాన పందిళ్ల గణపతులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):పాతబస్తీలోని గణేష్ నిమజ్జనాలు శుక్రవారం అర్ధరాత్రి కొన్ని, శనివారం మరికొన్ని అత్యంత వైభవంగా జరిగాయి. రెండు రోజులుగా భారీ విగ్రహాలన్నీ కృష్ణమ్మ ఒడికి చేరకుంటున్నాయి. పాతబస్తీలోని వివిధ ప్రముఖ సంస్థలకు చెందిన విగ్రహాల ఊరేగింపులను ఆయా నిర్వాహకులు అత్యంత భారీగా నిర్వహించారు. మంగళ వాయిద్యాలు, డప్పుల విన్యాసాలు, రాష్ట్రంతో పాటుగా వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన జానపద కళాకారుల ప్రదర్శనలతో, చిత్ర విచిత్ర వేషధారణలతో స్వామి వారి నిమజ్జన ఊరేగింపులు ముందుకు సాగాయి. క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ (వస్త్రలత) ఆధ్వర్యంలో వారి వ్యాపార సముదాయంలో ఉంచిన రెండు విగ్రహాలను భారీ వాహనాలపై అధిష్టింపజేసి ఊరేగించారు. అలాగే వివిధ చవితి పందిళ్ల నిర్వాహకులు ఏర్పాటు చేసిన కళారూపాలు ఆకట్టుకున్నాయి. తమిళనాడు, కేరళ నుంచి కళాకారులతో ప్రదర్శనలిప్పిస్తూ ఊరేగింపును నిర్వహించారు. అదేవిధంగా గణేష్ ఉత్సవ సమితి (మార్వాడీ సంఘం) ఆధ్వర్యంలోనూ భారీ ఊరేగింపుగా స్వామి వారిని నిమజ్జనానికి తరలించారు. అలాగే ఐదు దశాబ్దాల నుంచి ఉత్సవాలను నిర్వహిస్తున్న ఉమా పుత్ర సేవా సమితి (పూలబావి వీధి) నిర్వాహకులు సైతం స్వామి వారిని నిమజ్జనానికి వైభవంగా తరలించారు. పూజారివారి వీధిలోని శ్రీ బాలగణపతి సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకమూర్తిని ఊరేగించారు. రాయల్ హోటల్ సెంటర్‌లోని మిత్ర బృందం తమ గణపతిని నిమజ్జనానికి అంగరంగ వైభవంగా తరలించారు. వారితో పాటుగా మొయిన్‌బజార్‌లోని వివిధ సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలు సైతం నిమజ్జనానికి ఊరేగింపుగా తరలించారు.



భావనారాయణవీధిలోని విఘ్నేశ్వరుడు



కొత్తపేట రెండో కుమ్మరివీధిలో గణపతి



వస్త్రలత ఊరేగింపులో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన శివుని విగ్రహం



మార్వాడీ సంఘం విఘ్నేశ్వరుడు



ఊరేగింపులో ప్రత్యేక వేషధారణలు



పూజారి వారి వీధిలోని వినాయకుని విగ్రహం

నేత్రపర్వంగా గణపతి నగరోత్సవాలు



కెనాల్‌రోడ్డు గణపతి నగరోత్సవం



నగరత్సోవాన్ని ప్రారంభిస్తున్న వెలంపల్లి శ్రీనివాసరావు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):పాతబస్తీలోని ఆలయాల్లో కొలువై ఉన్న గణనాథుల నగరోత్సవాలు శనివారం నేత్రపర్వంగా కొనసాగాయి. ఉత్సవ మూర్తులను అంగరంగ వైభవంగా అలంకరించిన వాహనాలపై పాతబస్తీలో ఊరేగించారు. కెనాల్‌రోడ్డులోని శ్రీ వినాయకస్వామి వారి దేవస్థానంలో స్వామి వారి ఉత్సవమూర్తికి నగరోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. మూషిక వాహనదారుడై స్వామి వారు ఊరేగారు. భేతాళ నృత్యాలను ప్రదర్శించి ఆకట్టుకున్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాసరావు కొబ్బరికాయ కొట్టి నగరోత్సవాన్ని ప్రారంభించారు. గోపిశెట్టి మల్లయ్య తదితర ప్రముఖులు పాల్గొన్నారు. పూజారి వారి వీధిలోని శ్రీ బాలగణపతి ఆలయం స్వామి వారు సైతం గురువారం నగరోత్సవంలో ఊరేగారు. స్వామి వారి నగరోత్సవాన్ని పురస్కరించుకొని వివిధ జానపద కళారూపాలతో అలరించారు. ఈ సందర్భంగా స్వామి వారు ప్రధాన ఉత్సవమూర్తిని వాహనంపై అధిష్టింపజేయగా, మరో ఉత్సవమూర్తిని పల్లకీలో ఊరేగించారు. కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గ్రంధి శ్రీనివాసరావు, మామిడి వెంకటకృష్ణారావు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.



బాల గణపతి ఆలయ స్వామి వారి నగరోత్సవం

భక్తిశ్రద్ధలతో అనంత పద్మనాభస్వామి వ్రతం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ):చిట్టినగర్‌లోని శ్రీమహాలక్ష్మీ (కొత్త అమ్మవారి) ఆలయ ప్రాంగణంలో శనివారం అనంత పద్మనాభ స్వామి వారి వత్రాన్ని భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో ఆచరించారు. తెల్లవారుజామున ఆలయ ప్రాంగణంలో 12 మంది ఆళ్వార్‌లతో కొలువై ఉన్న అనంత పద్మనాభస్వామి వారికి విశేష అభిషేకాలు, తులసీ దళ అర్చనలను ఆలయ అర్చకులు నిర్వహించారు. అనంతరం ఆస్థాన కళ్యాణ మండపంలో స్వామి వారి వ్రతం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు వినుకొండ రత్నమాచార్యులు 30 మంది ఉభయదాతలచే స్వామి వారి వ్రతాన్ని ఆచరింపచేయడంతో పాటు వ్రత మహత్యాన్ని వివరించారు. వ్రతాన్ని ఆచరించిన భక్తులు, ఉభయదాతల ఇంట ఎటువంటి ఆర్థిక ఇబ్బందులు ఉండవని పేర్కొన్నారు. వ్రతంలో పాల్గొన్న ఉభయదాతలకు స్వామి వారి ప్రసాదాలు అందచేశారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ జరగగా, ఆలయ కమిటీకి చెందిన మరుపిళ్ల హనుమంతరావు, కోశాధికారి పిళ్లా శ్రీనివాసరావు, పోతిన ధర్మారావు, మజ్జి శ్రీనివాసరావులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



వ్రతాన్ని ఆచరిస్తున్న ఉభయదాతలు

ఘనంగా ఓనం వేడుకలు



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):విద్యార్థులు భారతీయ సంస్కృతి సాంప్రదాయాలను కొనసాగించే దిశగా అడుగులు వేయాలని పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కార్యదర్శి చిట్టా అమర్‌సుధర్ అన్నారు. ఆ కళాశాల కంప్యూటర్ అప్లికేషన్స్ విభాగం ఆధ్వర్యంలో ఓనం వేడుకలను శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంప్రదాయ వస్త్రధారణతో కేరళ సంప్రదాయ నృత్యాలను ప్రదర్శించి సందడి చేశారు. విద్యార్థినులు కేరళా సంప్రదాయ నృత్యమైన తిరువాతిర నృత్యాన్ని ప్రదర్శించారు. వేడుకలను పురస్కరించుకొని కళాశాల కార్యదర్శి చిట్టా అమర్‌సుధీర్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటుగా భారతీయ సంస్కృతిపైనా పట్టు సాధించాలన్నారు. ఐక్యత, వారసత్వం, సంప్రదాయ విలువల పరిరక్షణకు పాటుపడాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు కళాశాల ప్రాంగణంలో సందడి చేశారు. కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ శరవణకుమార్ పర్యవేక్షించారు. కళాశాల కోశాధికారి కాజా రాఘవయ్య, ఉపాధ్యక్షులు పొట్టి సురేంద్రకుమార్, సహాయ కార్యదర్శి గ్రంధి పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ పటిష్టతకు పాటుపడాలి



వెలంపల్లిని కలిసిన అనుబంధ విభాగాల నేతలు

వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలంపల్లి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వివిధ అనుబంధ విభాగాలకు నూతన నియమితులైన పార్టీ నేతలు పార్టీ పటిష్టతకు పాటుపడాలని ఆ పార్టీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌ఛార్జి వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో వెలంపల్లిని ఇటీవల నూతనంగా వివిధ పదవుల్లో నియమితులైన నాయకులు కలిసి కృతజ్ఞతలు తెలిపారు. వెలంపల్లి శ్రీనివాసరావుని కలిసిన వారిలో ఎన్టీఆర్ జిల్లా రైతు విభాగం ప్రధాన కార్యదర్శి బత్తిన మల్లికార్జున్‌రెడ్డి, జిల్లా రైతు విభాగం కార్యదర్శి మూలే కొండారెడ్డి, జిల్లా రైతు విభాగం కార్యవర్గ సభ్యులు కాపులపల్లి చిన్నారెడ్డి, తాడి అంజిరెడ్డి, జిల్లా సాంస్కృతిక విభాగం ప్రధాన కార్యదర్శి వెన్న వెంకట సుబ్బారెడ్డి, జిల్లా మైనారిటీ కార్యదర్శులు మొహసిన్ పాషా, షేక్ నజీర్, జిల్లా మైనారిటీ కార్యవర్గ సభ్యులు కరీముల్లా, ఈసుబ్, నజీర్ తదితరులు పాల్గొన్నారు. వారందరినీ వెలంపల్లి శ్రీనివాసరావు అభినందించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఆంజనేయరెడ్డి తదితరులు ఉన్నారు.

నేత్రదానంపై అవగాహన

పటమట(విజయవాడతూర్పు):నేత్రదానంపై అందరికీ అవగాహన ఉండాలని డీపీఎం డాక్టర్ ఈఎస్ఎన్ మూర్తి అన్నారు. తాడిగడపలోని ఎల్‌వీపీ కంటి ఆసుపత్రి సహకారంతో విజయవాడలోని ఎస్ఆర్ఆర్ - సీవీఆర్ కళాశాల నేత్రదానంపై విద్యార్థులకు శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. నేత్రదానం ప్రాముఖ్యతపై విద్యార్థులకు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఎల్‌వీపీ ఐ బ్యాంక్ సిబ్బంది మరణించిన దాతల నుంచి కార్నియాలను సేకరించే విధానాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్ఆర్ - సివిఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. భాగ్యలక్ష్మి, ఎన్‌సీసీ చీఫ్ డాక్టర్ రమేష్ తదితరులున్నారు.

72 అడుగుల మట్టి గణపతి నిమజ్జనం



నిమజ్జనాన్ని వీక్షిస్తున్న ప్రజలు



ఫైర్ ఇంజన్లతో నిమజ్జనం చేస్తున్న దృశ్యం

భవానీపురం(విజయవాడపశ్చిమ):విద్యాధరపురం లేబర్‌కాలనీ గ్రౌండ్‌లో దూండీ గణేష్ సేవా సమితి ఆధ్వర్యంలో 72 అడుగుల ఎత్తులో మట్టితో తయారు చేసిన శ్రీకార్యసిద్ధి మహాశక్తి గణపతి ఉత్సవాలు ముగిశాయి. ఈ నెల 27వ తేదీ వినాయక చవితి పండుగ మొదలుకుని 11 రోజులపాటు నిర్వహించిన వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి గణనాథుని నిమజ్జనంతో సమాప్తమయ్యాయి. ఉదయం వినాయకునికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అన్నప్రసాద వితరణ జరిగింది. భారీ గణపతి విగ్రహాన్ని నెలకొల్పిన చోటే ఫైర్ ఇంజన్ల వాటర్‌తో స్ప్రింకర్లతో స్వామివారి నిమజ్జన కార్యక్రమం అత్యంత వేడుకగా జరిగింది. ఉత్సవాల్లో భాగంగా వినాయక విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన 72 కిలోల బాహుబలి లడ్డూ ప్రసాదాన్ని వేలం వేయగా ఖమ్మం జిల్లాకు చెందిన జవ్వాజి వెంకటేశ్వర్లు రూ.7,20,000లకు దక్కించుకున్నారు. కాగా గణనాథుని నిమజ్జనం చేయగా వచ్చిన మట్టిని ఆదివారం ఉదయం 10 గంటల నుంచి పంచిపెట్టనున్నట్లు దూండీ గణేష్ సేవా సమితి కమిటీ సభ్యులు దూండీ రాకేష్ తెలిపారు.

బాలుడు అదృశ్యంపై కేసు నమోదు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బిస్కెట్స్ కోసమని ఇంటి నుంచి బయటకు వెళ్లిన బాలుడు అదృశ్యమైన ఘటన విద్యాధరపురంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు... విద్యాధరపురం కృష్ణారావు వీధికి చెందిన తమ్మిన హేమంత్ నేషనల్ స్కూల్‌లో పదో తరగతి చదువుతున్నాడు. 9వ తరగతి వరకు వేరే స్కూల్‌లో చదివాడు. ఆ సమయంలో చెడు స్నేహాలకు అలవాటు పడ్డాడు. స్కూల్‌కు సక్రమంగా వెళ్లకుండా క్రికెట్ పందాలు వేస్తుండటంతో ఇంట్లో తెలిసి మందలించారు. ఆ తర్వాత స్కూల్ మార్పించారు. అయినప్పటికీ అతనిలో మార్పు రాలేదు. నెల రోజుల క్రితం ఒకసారి ఇంటి నుంచి వెళ్లిపోయి తిరిగి వచ్చాడు. ఇంటికి వచ్చిన అతడిని తల్లిదండ్రులు నిలదీయగా తిరుపతి వెళ్లానని సమాధానం ఇచ్చాడు. తర్వాత రోజు నుంచి స్కూల్‌కు వెళుతున్నాడు. ఆగస్టు 31వ తేదీ రాత్రి సమయంలో బిస్కెట్స్ కోసం బయటకు వెళుతున్నానని చెప్పి ఇంటి నుంచి వెళ్లాడు. ఆ తర్వాత ఇంటికి తిరిగి రాలేదు. అప్పటి నుంచి అతని కోసం వెతికినా ఆచూకీ దొరకలేదు. దీంతో బాలుడి తల్లి సత్యవేణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం పోలీసులు కేసు నమోదు చేశారు.